## కేంద్ర బడ్జెట్ పత్రాల దహనం



కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పత్రాలను తగలబెట్టి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నదని సీపీఎం జిల్లా నాయకులు అవర్గ ముత్యం ఆరోపించారు. సోమవారం మండల కేంద్రమైన దిలావర్‌పూర్ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 సంవత్సరం పత్రాలను తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు, మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలకు ఎలాంటి సహాయాన్ని అందించకుండా కార్పొరేట్ సంస్థలకు భారీ పన్ను మినహాయింపులు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. తెలంగాణకు రావాల్సిన నిధులు గణనీయంగా తగ్గించి రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఖయ్యూం, పోశెట్టి, ప్రవీణ్, నారాయణ పాల్గొన్నారు.

## నాగోబా దర్శనానికి తరలివస్తున్న భక్తులు



నాగోబా దర్శనానికి ఆలయంలో బారులుదీరిన భక్తులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 3 : ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా దర్శనానికి ఆయా ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. సోమవారం భక్తులు కుటుంబ సమేతంగా తరలిరావడంతో జాతర ప్రాంతంతోపాటు ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రాంతాలతోపాటు ప్రజలు, ప్రముఖులు, అధికారులు తరలివచ్చి నాగోబాకు పూజలు చేశారు. నాగోబా జాతర మొదలైనప్పటి నుంచి నేటి వరకు దాదాపు 3 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు ఈవో రాజమౌళి తెలిపారు. కాగా, ఆలయంలో మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు.

## సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయవద్దు..

జైనథ్ మండలంలోని పెండల్‌వాడ చెరువు సమీపంలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయవద్దని ఆ గ్రామానికి చెందిన రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామంలో చెరువు నిర్మిస్తే తమ పొలాలకు సాగు నీరు అందుతుందనే ఆశతో తమ భూములు ప్రభుత్వానికి ఇచ్చామని తెలిపారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం అధికారులు సర్వే నిర్వహించారని, ప్లాంట్ నిర్మాణం వల్ల నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. చెరువు కోసం ఇచ్చిన భూముల్లో ఇతర నిర్మాణాలు చేపట్టవద్దని కోరారు.



# వినతుల వెల్లువ

- ప్రజావాణిలో సమస్యలను పరిష్కరించాలంటూ 78 వినతులు
- దరఖాస్తులను స్వీకరించిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులకు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ రాజర్షి షా దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో 78 మంది కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

## సెల్ టవర్ పనులు ప్రారంభించాలి

తమ గ్రామంలో సెల్‌ఫోన్ సిగ్నల్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, గ్రామంలో మంజూరైన బీఎస్ఎన్ఎల్ టవర్ పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గాదిగూడ మండలంలోని సావ్రి గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో 800 జనాభా ఉందని సెల్‌సిగ్నల్ లేకపోవడంతో ఫోన్‌లు పనిచేయక అవస్థలు పడుతున్నామని తెలిపారు.



## రోడ్డు సౌకర్యం కల్పించాలి

తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని బజార్‌హత్నూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామస్తులు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గ్రామానికి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతోపాటు వర్షాకాలంలో పెద్దవాగు పొంగి ప్రవహిస్తుందన్నారు. దీంతో తాము వ్యవసాయ పనులు, నిత్యావసర సరకులు, ఇతర పనుల కోసం బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుందని తెలిపారు. గతంలో పలు మార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని తెలిపారు.



# హామీలు నెరవేర్చే వరకు ప్రశ్నిస్తాం..

- మాజీ మంత్రి జోగు రామన్న
- బీఆర్ఎస్ పార్టీ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, పార్టీ నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలను నెరవేర్చే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, సాజిదొద్దీన్, బుట్టి శివ, ధమ్మపాల్, కొండా గణేశ్, లక్ష్మణ్, అడప తిరుపతి, శ్రీనివాస్, అత్త ఉల్లా, అయ్యూబ్, సురేందర్, ఆలం తదితరులు పాల్గొన్నారు.

# వసంతోత్సవం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్



అమ్మవారి పట్టువస్త్రాలతో కలెక్టర్ అభిలాష అభినవ్

బాసర, ఫిబ్రవరి 3 : చదువుల తల్లి బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రం వసంత పంచమి సందర్భంగా భక్తజన సంద్రమైంది. సోమవారం వేకువ జామున మూడు గంటల నుంచే అమ్మవారి దర్శనంతోపాటు చిన్నారుల అక్షరాభ్యాసాల కోసం క్యూలైన్‌లో భక్తులు బారులుదీరారు. సోమవారం సుమారు లక్ష మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయాధికారులు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయక పోవడంతో ఇక్కట్లు తప్పలేదు.

### పట్టు వస్త్రాలు సమర్పించిన కలెక్టర్

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం తరపున కలెక్టర్ అభిలాష అభినవ్ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మొదటగా కలెక్టర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో రూ.1000 అక్షరాభ్యాసాలు 3320, రూ.150 అక్షరాభ్యాసాలు 2404 మొత్తం అక్షరాభ్యాసాలు 5724 జరిగాయి. ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా అమ్మవారికి రూ.58 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఎస్పీ జానకి షర్మిల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇబ్బందులు కలుగకుండా ఉత్సవాలను ముగించారు. కాగా.. అమ్మవారి ప్రసాదం లడ్డు, పులిహోర కోసం బారులుదీరగా.. ప్రసాదం అందలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులు అసహనం వ్యక్తం చేస్తూ.. కొందరు కొనుగోలు చేయకుండా వెనుదిరిగారు.

## మండలి నామినేషన్ల పర్వం మొదలు

- మొదటిరోజు తొమ్మిది మంది.. 13 నామినేషన్లు
- గ్రాడ్యుయేట్ స్థానానికి ఎనిమిది, ఉపాధ్యాయ స్థానానికి ఐదు దాఖలు

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 : కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి స్థానాలకు సోమవారం నుంచి నామినేషన్ల పర్వం మొదలైంది. ఈ నెల 8,9 ప్రభుత్వ సెలవులు మినహా ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనున్నది. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయంలో రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు తీసుకోనుండగా, మొదటి రోజు తొమ్మిది మంది 13 నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో పట్టభద్రుల స్థానానికి ఆరుగురు ఎనిమిది సెట్ల నామినేషన్లు, ఉపాధ్యాయ స్థానానికి ముగ్గురు ఐదు సెట్ల నామినేషన్లు వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. పట్టభద్రుల స్థానానికి గూడెం మహిపాల్(జగిత్యాల), చిలువేరి శ్రీకాంత్(కరీంనగర్), గవ్వ లక్ష్మి(ఆదిలాబాద్), మంచికట్ల ఆశమ్మ(ఆదిలాబాద్), చాలక చంద్రశేఖర్, కంటె సాయన్న(హైదరాబాద్) ఉండగా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి(సిద్దిపేట), చాలక చంద్రశేఖర్(హైదరాబాద్), చిలువేరి శ్రీకాంత్(కరీంనగర్) రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్లు అందజేశారు. వీరిలో ఇద్దరు అభ్యర్థులు గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ స్థానాలకు దాఖలు చేశారు.

# బీసీలపై కుట్ర



### చిత్తశుద్ధితో సర్వే చేయలేదు..



కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఈ సర్వే చేయలేదు. బీసీలను తగ్గించి చూపాలనే అగ్రవర్ణాల కుట్రలో భాగమే లోపాల పుట్టయిన ఈ సర్వే వివరాలు. బీసీ జనాభాను తగ్గించి, రిజర్వేషన్లు రాకుండా చేయాలనే కుట్ర దాగుంది. దీనికి ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుంది. రాబోయే రోజుల్లో బీసీల తడాఖా చూపిస్తాం.
**- వడ్డేపల్లి మనోహర్, జిల్లా బీసీ జేఏసీ నాయకుడు, మంచిర్యాల**

సమగ్ర కుటుంబ సర్వే సక్రమంగా చేయలే..

16 లక్షల మంది వివరాలు సేకరించలే..

బీసీ జనాభాను తక్కువ చేసి చూపించారు..

అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి..

అంతా తప్పల తడకగా చేశారు

సర్వేను ప్రామాణిక పద్ధతిలో చేయలేదు..

## సమగ్ర కుటుంబ సర్వే సరిగ్గా చేయలేదంటున్న బీసీలు

- బీసీ జనాభాను తక్కువ చేసే చూపించారనే ఆరోపణ
- అసెంబ్లీలో రిజర్వేషన్ బిల్లుపెట్టాలంటూ డిమాండ్

మంచిర్యాల, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతంగా ఉందని చెప్పిన సర్కారు.. సర్వే సరిగా జరగలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో లక్షలాది కుటుంబాలను సర్వే చేయకుండానే బీసీ జనాభాపై స్పష్టత ఎలా వచ్చిందంటూ బీసీ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇంకా 16 లక్షల మంది వివరాలు సేకరించలేకపోయామని చెప్తున్న సర్కారు.. తుది లెక్కలను ఎలా తేల్చిందో చెప్పాలంటున్నారు. గత సర్కారు చేసిన సర్వేలు, అంచనాల మేరకు రాష్ట్రంలో బీసీ జనాభా 50 శాతం నుంచి 52 శాతం ఉండాలన్నారు. కాంగ్రెస్ సర్కారు కేవలం 46.2 శాతం బీసీలు ఉన్నట్లు తేల్చడం బాధాకరమంటున్నారు. సకల జనుల సర్వేకు ఇప్పుడు చేసిన సర్వేకు బీసీ జనాభా 21 లక్షలు తగ్గిందంటున్నారు. ఎక్కడైనా జనాభా పెరగాలే తప్ప, తగ్గడం ఏంటో అర్థం కావడం లేదంటున్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే బీసీ జనాభాను తక్కువ చేసి చూపించారంటూ మండిపడుతున్నారు. ఇప్పుడు సర్కార్ తీసిన లెక్కల మేరకైనా అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టకుండా చర్చతో లాభం ఏం ఉండదంటున్నారు. ఇలా కాని పక్షంలో మరోసారి కులగణన చేయాలని, బీసీ జనాభా ఎంత ఉందో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. రిజర్వేషన్లు అమలు చేయాలంటూ రాజ్యాంగం పట్టుకుని దేశమంతా తిరుగుతున్నా రాహుల్ గాంధీ.. తెలంగాణ బీసీల విషయంలో అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మరోసారి సర్వే చేసి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### ❖ రిజర్వేషన్ శాతం తగ్గించే కుట్ర..



నిర్మల్, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణనకు ఎలాంటి శాస్త్రీయత లేదు. అన్నీ తప్పుడు లెక్కలే. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలను పరిగణలోకి తీసుకోకుండానే 50 శాతానికి పైగా బీసీలే ఉన్నరు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ తప్పుడు గణాంకాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది. ముస్లిం మైనార్టీలు 10 శాతం, బీసీలు 46 శాతం కలుపుకొని మొత్తం 56 శాతం ఉన్నరని చెప్పడం దారుణం. ముస్లింలను కలపక ముందే బీసీల జనాభా 55 నుంచి 56 శాతం ఉంటుంది. ఈ తప్పుడు లెక్కలను ప్రభుత్వం వెంటనే సరి చేయాలి. లేకుంటే మళ్లీ కుల గణన సర్వే చేసి వాస్తవాలను బయట పెట్టాలి. ప్రస్తుత లెక్కలతో రిజర్వేషన్లు కల్పిస్తే బీసీలకు అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఇస్తామన్న 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. కొత్తగా చెబుతున్న బీసీల సంఖ్య బూచీ చూపించి రిజర్వేషన్ల శాతాన్ని తగ్గించే కుట్రలకు పాల్పడితే ఊరుకోం. ఈ కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే రైతుభరోసాను రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రూ. 12 వేలకు తగ్గించారు. అదేవిధంగా ఇప్పుడు బీసీల సంఖ్యను తక్కువగా చూపించి రిజర్వేషన్ శాతాన్ని కూడా తగ్గించే అవకాశమున్నది.
**- ఎంబడి చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నిర్మల్**

### ❖ తప్పుల తడకగా సర్వే..



ఈ సర్వే తప్పుల తడకగా ఉంది. బీసీ జనాభా ఉన్నదాని కంటే తక్కువగా చూపించారు. దేశ వ్యాప్త కులగణన ఎందుకు చేయడం లేదు. రిజర్వేషన్లు పెంచడం ఇష్టం లేకనే ఇలా తప్పుడు లెక్కలు చెప్పారు. హిందూ బీసీ జనాభానే 56 శాతం వరకు ఉంటుంది. దీనిపై ప్రభుత్వాన్ని ఎండగడుతాం. సర్వేను ప్రామాణిక పద్ధతులతో చేయలేదు. కుంటిసాకులతో మొత్తం సర్వే చేయలేదు. ప్రజలు అందుబాటులో లేరని బీసీ జనాభాలో కోత విధించారు. **- గుమ్ముల శ్రీనివాస్, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, మంచిర్యాల**

### ❖ శాస్త్రీయత లేని సర్వే



కోటపల్లి, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, ఉపాధి, కుల సర్వే శాస్త్రీయత లేని సర్వే. ప్రభుత్వం పట్టింపులేని తనం కారణంగా మొదటి నుంచి సర్వేలో తప్పులే దొర్లాయి. ఇందుకు నిదర్శనం నాలుగు గ్యారెంటీల అమలులో అర్హుల పేర్లు లేకపోవడమే. ఇలాంటి అసమగ్ర సర్వేను ఏరకంగా ప్రామాణికంగా తీసుకొని బీసీల జనాభా సంఖ్యను నిర్ణయిస్తారు. ఇంకా సర్వేకు దూరంగా 16 లక్షల మంది ఉన్నారు. కానీ సర్వే పూర్తయిందని ప్రభుత్వం చెప్పడం బీసీలను మోసగించడమే అవుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి మరో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. సర్వే చేసి నిజమైన బీసీల సంఖ్యను వెలువరించాలి. **- తాటికొండ సురేశ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం యూత్ నాయకుడు**

### ❖ సర్వే పూర్తి చేయకుండా లెక్కలు ఎలా తేల్చుతారు



కోటపల్లి, ఫిబ్రవరి 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇంటింటి సర్వే పూర్తిగా తప్పుల తడక. రాష్ట్రంలో వంద శాతం సర్వే పూర్తి చేసి నివేదిక వెల్లడించాల్సి ఉంది. కానీ 96.9 శాతం మాత్రమే సర్వే చేసి పూర్తయిందంటే ఎలా? మిగతా 3.1 శాతం కుటుంబాల సర్వే చేయకుంటే సర్వే ఎలా పూర్తి అవుతుంది. అసంపూర్తి సర్వేను ప్రభుత్వం ఆమోదిస్తే బీసీలకు అన్యాయం జరిగే అవకాశముంటుంది. ఇలాంటి అసంపూర్తి సర్వేను ఆమోదిస్తే బీసీలు తీవ్రంగా నష్టపోతారు. సర్వేను పూర్తి చేసిన తర్వాతే గణాంకాలు వెలువరిస్తే బీసీలకు న్యాయం జరుగుతుంది.
**- గాదె శ్రీనివాస్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి**

## రైతులు సంఘాలుగా ఏర్పడి
# బలంగా ఉండాలి

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్**



ఆర్థిక సాయం అందజేస్తున్న రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

బేల, ఫిబ్రవరి 3 : పంజాబ్, హర్యాన రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలోనూ రైతులు సంఘాలుగా ఏర్పడి బలంగా మారాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ సూచించారు. సోమవారం శంషాబాద్ గ్రామంలో అప్పులబాధతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఖోడే గోవింద కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ ప్రకారం.. క్వింటాలుకు గిట్టుబాటు ధరను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి, శ్రమతో కలిపి మరో సగభాగంతో నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వాలే ప్రభుత్వ రంగ సంస్థలతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగేలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రిటైర్డ్ హెచ్ఎం శశికాంత్, అధ్యాపకుడు నరసింహారావు, మాజీ సర్పంచ్‌లు ఓల్లప్ వార్ దేవన్న, కోడె విపిన్, యూత్ సభ్యులు రవి, హరీశ్, విశాల్ పాల్గొన్నారు.